సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 5 । అక్టోబర్ । 2023



మిడ్‌మానేరులో 27 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులో బుధవారం రికార్డుస్థాయిలో 27.01 టీఎంసీల మేర నీటి నిల్వ చేరింది. ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి వరద వస్తోంది.



పేరుకే మైదానం !

సిరిసిల్ల జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. వాకర్లు, క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు.

-II లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

గొర్రెలు ఎప్పుడిస్తరు ?



బైఠాయించిన గొల్ల కురుమలు

ముస్తాబాద్(సిరిసిల్ల): పైసలు కట్టి ఆరు నెలలైందని.. గొర్రెలు ఎప్పుడిస్తారో చెప్పాలని ముస్తాబాద్‌–సిద్దిపేట ప్రధాన రహదారిపై బుధవారం గొల్లకురుమలు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ బందనకల్‌కు చెందిన 108 కుటుంబాలకు గొర్రెల యూనిట్లు ఇస్తామని డీడీ కట్టించుకొని కాలయాపన చేస్తున్నారన్నారు. అప్పులు తెచ్చి డీడీ తీశామని, ఆరు నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. మంత్రి కేటీఆర్ చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరారు. రాగుల పర్శరాములు, శ్రీనివాస్, తిరుపతి, రాజు, స్వామి, రాజమల్లు పాల్గొన్నారు.

రంగినేని లక్ష్మి స్మారక సాహిత్య పురస్కారాలు

సిరిసిల్లకల్చరల్: నిరుపేద పిల్లలను చేరదీసి అక్కున చేర్చుకుంటున్న రంగినేని సుజాత మోహన్‌రావు చారిటబుల్ ట్రస్టు తన సాహితీసేవల్లో భాగంగా రేగులపాటి(రంగినేని) లక్ష్మి పేరిట మరో సాహిత్య పురస్కారాన్ని ఏర్పాటు చేసేందుకు ట్రస్టు నిర్ణయించింది. ఈమేరకు ఏటా ఉత్తమ బాలసాహితీవేత్తలను గుర్తించి సత్కరించనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు రంగినేని నవీన్‌రావు, కమిటీ కార్యదర్శి గరిపెల్లి అశోక్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2020 నుంచి 2022 వరకు వెలువడిన సాహిత్యానికి సంబంధించి ఒకేసారి మూడు పురస్కారాలను ఈ ఏడాది ముగిసేలోపు అందజేస్తామన్నారు. రూ.5వేల నగదు, ప్రశంసాపత్రం, శాలువా ప్రదానం చేస్తామన్నారు. పురస్కార కమిటీ కన్వీనర్‌గా కన్వీనర్‌గా డాక్టర్ సిరిసిల్ల చందన శాశ్వత సభ్యులుగా, జి.శ్రీమతి సభ్యులుగా ఉంటారన్నారు.


కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

చందుర్తి(వేములవాడ): ధాన్యం కొనుగోలు కేంద్రానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని చందుర్తికి చెందిన రైతులు తహసీల్దార్ లక్ష్మీనారాయణకు బుధవారం వినతిపత్రం అందించారు. కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించకపోవడంతో ధాన్యాన్ని రోడ్ల వెంబడి కుప్పలుగా పోస్తున్నామని తెలిపారు. చందుర్తి శివారులోని 20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కొనుగోలు కేంద్రానికి కేటాయించాలని కోరారు. మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, మర్రి రాజు, బత్తుల వసంత్‌కుమార్, తోట శ్రీనివాస్, పెద్ది శ్రీను, నక్క మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత సామాజిక బాధ్యత



వాహన తనిఖీలు చేస్తున్న సీఐ, ఎస్సైలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ శశిధర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని రాచర్లగొల్లపల్లి శివారులో బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేయడంతోపాటు ధ్రువీకరణపత్రాలు లేని 31 వాహనాలకు జరిమానాలు విధించారు. సీఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామని, మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సై రమాకాంత్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

6న మోడల్ లేఅవుట్‌లో ప్లాట్ల వేలం

సిరిసిల్లటౌన్: మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో వెంకటాపూర్‌–రగుడు బైపాస్ రోడ్డులోని ప్రభుత్వ లేఅవుట్లలో ఓపెన్‌ప్లాట్లకు బహిరంగ వేలం వేస్తున్నట్లు కమిషనర్ ఆయాజ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ భూమిలోని సర్వేనంబర్ 405లో 239 ప్లాట్లతో వెంచర్ అభివృద్ధి చేసినట్లు తెలిపారు. 146, 162, 166, 183, 200, 216, 222, 244, 288 చదరపు గజాల సైజుల్లో ప్లాట్లు ఉన్నట్లు వివరించారు. ఈనెల 6న సినారె ఆడిటోరియంలో వేలం, ప్రీ బిడ్డింగ్‌లో పాల్గొనాలని కోరారు.

ఓటర్లు..31.12 లక్షలు



ఉమ్మడి జిల్లాలో మహిళలే ఎక్కువ



- ఐదేళ్ల కింద 13 నియోజకవర్గాల్లో 27.88 లక్షల మందే
- కొత్త ఓటర్ల సంఖ్య 3,24,198
- కరీంనగర్‌లో అత్యధికం, రామగుండంలో అత్యల్పం
- పేర్ల నమోదుకు ఇంకా గడువు ఉంది

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

త్వరలో జరగనున్న ఎన్నికలకు అధికార గణం సిద్ధమైంది. ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం బుధవారం విడుదల చేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 31,12,283 మంది ఓటర్లు ఉన్నారని అధికారులు వెల్లడించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27,88,085 మంది ఉండగా.. ఐదేళ్లకు 3,24,198 మంది కొత్త ఓటర్లు నమోదయ్యారు. వీరిలో అధిక శాతం యువతే. ఓటరు నమోదుపై ఎన్నికల సంఘం చేసిన ప్రచార కార్యక్రమాలు, ప్రధాన మీడియా, సోషల్ మీడియా ద్వారా చేసిన ప్రచారం ఇందుకు దోహదపడిందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. బీఎల్‌వోలకు ఇచ్చిన శిక్షణ, డబుల్ ఓట్ల ఏరివేత, మరణించినవారి ఓట్లు తొలగింపు, ఆరు కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్లలో కుటుంబాల ప్రత్యక్ష తనిఖీలు, నకిలీ ఓటర్ల వడపోత తదితరాల ఫలితంగా ఈసారి వీలైనంత వరకు దోషాలు లేని జాబితాను రూపొందించినట్లు తెలిపారు.

ప్రతీ నియోజకవర్గంలో పెరిగిన సంఖ్య..

ప్రతీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య పెరిగింది. మొత్తం 13 నియోజకవర్గాల్లో సంఖ్యాపరంగా చూసినప్పుడు 3,41,913 మంది ఓటర్లతో కరీంనగర్ అగ్రస్థానంలో నిలవగా.. 2,14,974 ఓటర్లతో పెద్దపల్లి జిల్లా రామగుండం చివరి స్థానంలో నిలిచింది. కరీంనగర్ జిల్లాలో కొత్తగా 54,831 మంది నమోదయ్యారు. నగరంలో పెరిగిన సదుపాయాలు, వలసలు, విద్యాసంస్థలు, ఉమ్మడి జిల్లాలో రిటైరైన వారంతా ఇక్కడే స్థిరపడటం తదితరాలు ఇందుకు కారణమని అధికారులు అంటున్నారు. మిగిలిన 12 నియోజకవర్గాల్లోనూ వేలాదిగా ఓట్లు పెరగడం నేటితరంలో ఓటు చైతన్యంపై వచ్చిన మార్పుగా మరికొందరు అభిప్రాయపడుతున్నారు.

పెరుగుదల ఇలా..

కోరుట్లలో 20,652, జగిత్యాలలో 24,021, ధర్మపురిలో 17,890, రామగుండంలో 25,882, మంథనిలో 23,591, పెద్దపల్లిలో 27,413, కరీంనగర్‌లో 54,831, చొప్పదండిలో 16,957, వేములవాడలో 25,451, సిరిసిల్లలో 22,408, మానకొండూర్‌లో 15,909, హుజూరాబాద్‌లో 35,181, హుస్నాబాద్‌లో 14,005 మంది ఓటర్లు పెరిగారు.

సర్వీసు ఓటర్లు 1,594 మంది..

ఉమ్మడి జిల్లాలో నియోజవర్గాల వారీగా సర్వీసు ఓటర్లు.. కరీంనగర్‌లో 101, చొప్పదండిలో 192, మానకొండూరులో 128, హుజూరాబాద్‌లో 163, కోరుట్లలో 47, జగిత్యాలలో 43, ధర్మపురిలో 131, వేములవాడలో 52, సిరిసిల్లలో 106, రామగుండంలో 213, మంథనిలో 155, పెద్దపల్లిలో 263 మొత్తం1,594 మంది ఉన్నారు. వీరంతా సైన్యంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిసున్నారు.

దరఖాస్తు చేసుకోండి..

సెప్టెంబరు 19 వరకు కొత్త ఓటర్ల నమోదు, ఓటు బదిలీ, సవరణలకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఒకవేళ ఓటుపై అభ్యంతరాలు, ఇతర క్లెయిములు ఇంకా పరిష్కారానికి నోచుకోని వారి దరఖాస్తులు పరిష్కరిస్తారు. అలాగే, ఇంకా దరఖాస్తు చేసుకోని కొత్త పౌరులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. నామినేషన్‌కు ఆఖరు తేదీకి సరిగ్గా 10 రోజుల ముందు వరకు అవకాశం ఉంటుందని తెలిపింది. అన్ని రకాల దరఖాస్తులకు voters.eci.gov.in వెబ్‌సైట్‌లో లేదా ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ (వీహెచ్‌ఏ) లేదా బీఎల్వోను లేదా ఓటరు హెల్ప్‌లైన్ 1950లో సంప్రదించవచ్చు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం
కరీంనగర్	1,71,254	1,70,615	44	3,41,913
చొప్పదండి	1,11,197	1,18,141	08	2,29,346
మానకొండూరు	1,07,371	1,11,041	01	2,18,413
హుజూరాబాద్	1,19,676	1,24,833	05	2,44,514
జగిత్యాల	1,09,300	1,17,315	20	2,26,635
కోరుట్ల	1,13,030	1,23,692	04	2,36,726
ధర్మపురి	1,09,963	1,14,622	06	2,24,591
సిరిసిల్ల	1,17,872	1,22,920	06	2,40,798
వేములవాడ	1,04,943	1,13,186	31	2,18,160
పెద్దపల్లి	1,23,768	1,25,555	09	2,49,332
రామగుండం	1,08,233	1,06,716	25	2,14,974
మంథని	1,13,828	1,16,458	20	2,30,306
హుస్నాబాద్	1,17,165	1,19,406	04	2,36,575
మొత్తం	15,27,600	15,84,500	183	31,12,283

బతుకమ్మ చీరలతో బహుముఖ ప్రయోజనం



చీరలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

- నేతన్నలకు ఉపాధి.. మహిళలకు కానుక
- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- కలెక్టరేట్‌లో చీరల పంపిణీకి శ్రీకారం

సిరిసిల్ల: రాష్ట్రంలోని తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతి మహిళకు బతుకమ్మ పండగ కానుకగా ప్రభుత్వం చీరలను అందిస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం బతుకమ్మ చీరల పంపిణీకి శ్రీకారం చుట్టారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ మాట్లాడుతూ సిరిసిల్ల నేత కార్మికులకు ఉపాధి కల్పించడంతోపాటు మహిళలకు పండగ కానుకగా.. చీరలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. బతుకమ్మ చీరల ఆర్డర్లతో సంక్షోభంలో ఉన్న వస్త్రపరిశ్రమ కుదుటపడిందన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమం, అభివృద్ధి పనుల్లో రాష్ట్రం ముందుందన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వం చీరెను సారెగా ఆడబిడ్డలకు అందిస్తుందన్నారు. ఈ ఏడాది 25 రంగుల్లో 25 డిజైన్లలో 525 రకాల చీరలను సిరిసిల్ల నేతన్నలు ఉత్పత్తి చేశారని వివరించారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, అదనపు కలెక్టర్ బి.గౌతమ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయసంస్థ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, బీఆర్‌ఎస్ నాయకులు చీటి నర్సింగరావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్, చేనేత జౌళిశాఖ ఏడీ సాగర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్ పాల్గొన్నారు.

అన్నదాతల సేవకు సహకారం

- రాష్ట్రంలోనే తొలి సహకార రైసుమిల్లు గోరింటాలలో
- భూమి పూజ చేసిన టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



సహకార రైసుమిల్లు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): అన్నదాతలకు సహకార సంఘాలు అన్ని విధాల సేవలందిస్తున్నాయని, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో సహకార రంగం అభివృద్ధి బాటలో పయనిస్తోందని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. కేంద్ర సహకార బ్యాంక్ సహకారంతో నాబార్డు అధికారుల పర్యవేక్షణలో రాష్ట్రంలోనే తొలి సహకార రైసుమిల్లు మండలంలోని గోరింటాలలో రూ.3.30 కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. బుధవారం రైసుమిల్లు, గోదాముల నిర్మాణానికి భూమి పూజ చేశారు. సర్పంచ్ కొలుముల అంజమ్మ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, ఎంపీపీ వంగ కరుణ, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ రామానుజాగౌడ్, డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పవర్‌లూమ్స్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, ఆర్‌బీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

- సిరిసిల్ల ఆర్డీవో ఎన్.ఆనంద్‌కుమార్

సిరిసిల్లటౌన్: ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించినట్లు సిరిసిల్ల ఆర్డీవో ఎన్.ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలతో బుధవారం తన కార్యాలయంలో అన్ని రాజకీయపార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వివిధ పార్టీల ప్రతినిధులు నాగుల శ్రీనివాస్, గజభీంకార్ రాజన్న, రంజిత్, కళ్యాణ్, ముస్తాఫా, దయాకర్ రావు, కరుణాకర్ పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ నియోజకవర్గ ఓటరు తుది జాబితాను వెలువరించినట్లు ఆర్డీవో మధుసూదన్ తెలిపారు. తన కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఆర్డీవో మాట్లాడుతూ వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,18,160 మంది ఓటర్లుగా నమోదయ్యారని.. పురుషులు 1,04,992, స్త్రీలు 1,13,189, థర్డ్ జెండర్ 31 మంది ఉన్నట్లు వివరించారు. ఓటరు తుది జాబితాను రాజకీయ పార్టీల నాయకులకు అందజేశామని చెప్పారు. తహసీల్దార్ మహేశ్ కుమార్, పోలాస నరేందర్, దినేశ్, సత్తయ్య, మైలారం రాము, నరేశ్, జింక ఎల్లయ్య ఉన్నారు.

వర్కర్ టు ఓనర్ లూమ్స్ అందించాలి



సిరిసిల్ల జౌళిశాఖ ఆఫీస్ ముందు ధర్నా చేస్తున్న నేతకార్మికులు

- యారన్ సబ్సిడీ విడుదల చేయాలి
- జౌళిశాఖ ఆఫీస్ ముందు నేతన్నల ధర్నా

సిరిసిల్ల: నేతకార్మికులను ఓనర్లను చేసే వర్కర్ టు ఓనర్ పథకంలో లూమ్స్ అందించాలని నేతన్నలు బుధవారం స్థానిక జౌళిశాఖ ఆఫీస్ ముందు ధర్నా చేశారు. 2017లో సీఎం కేసీఆర్ వర్కర్ టు ఓనర్ పథకానికి శంకుస్థాపన చేశారని ఆరేళ్లు పూర్తయినా ఒక్కరిని కూడా ఓనర్‌ను చేయలేదన్నారు. పెద్దూరు శివారులో షెడ్లు నిర్మించినప్పటికీ మిషనరీ బిగించలేదని పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ప్రభుత్వం వర్కర్ టు ఓనర్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2021 నాటి బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేసిన కార్మికులకు రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీ చెల్లించాలని, 2018 నాటి యారన్ సబ్సిడీ ఇంకా 58 మందికి, 2020 నాటి యారన్ సబ్సిడీ 63 మందికి పెండింగ్‌లో ఉందని సీఐటీయూ నాయకుడు మూషం రమేశ్ ఆరోపించారు. యారన్ సబ్సిడీ ఇవ్వాలని, నేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జౌళిశాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. కోడం రమణ, ఎలిగేటి రాజశేఖర్, నక్క దేవదాస్, రమేశ్, మల్లేశం పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల సమస్యలు తీర్చాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కల్పించాలి
- రూ.10వేలు పింఛన్ ఇవ్వాలి
- మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు దేవయ్య



మాజీ సర్పంచుల యుద్ధభేరిలో మాట్లాడుతున్న దేవయ్య

సిరిసిల్లటౌన్: తమ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్, మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన మాజీ సర్పంచుల యుద్ధభేరిలో మాట్లాడారు. నెలకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలని, అర్హులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, ఉచిత హెల్త్‌కార్డులు, బస్సుపాస్‌లు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని కోరారు. హిందూ సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పత్తిపాక సురేశ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సిరిసిల్ల నుంచి మంత్రి కేటీఆర్‌పై ఇండిపెండెంట్‌గా పోటీలో ఉంటున్నట్లు ప్రకటించారు. మాజీ సర్పంచుల సంఘం ప్రతినిధులు చందనగిరి గోపాల్, గుర్రం భూపతిరెడ్డి, బుర్ర మల్లేశంగౌడ్, మచ్చ నారాయణ, ఎర్రం మహేశ్, తుకారాం, రామ్‌రెడ్డి, సత్తయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘సహకారం’లో మరిన్ని సేవలు

- కామన్ సర్వీస్ సెంటర్లు ప్రారంభం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 44 సంఘాల్లో..
- రైతులకు అందుబాటులో 260 రకాల సేవలు



గంభీరావుపేట సహకార సంఘంలో ఏర్పాటు చేసిన సీఎస్‌సీ

గంభీరావుపేట(సిరిసిల్ల): సహకార రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే రైతులకు అనేక సేవలందిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు తాజాగా మరిన్ని సేవలను రైతులకు అందుబాటులోకి తెచ్చాయి. సహకార సంఘాల్లో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటవుతున్నాయి. కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో దాదాపు 100 సహకార సంఘాలు ఉన్నాయి. వాటిలో ప్రస్తుతానికి 44 సంఘాల్లో కామన్ సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. గంభీరావుపేట సింగిల్‌విండో కార్యాలయంలో టెస్కాబ్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్ రావు సీఎస్‌సీని ప్రారంభించారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా రైతులకు, సంఘ సభ్యులకు 260 రకాల వివిధ సేవలు అందనున్నాయి. పంట రుణాలు తీసుకోవడానికి వచ్చే రైతుల భూములకు సంబంధించిన పహనీలు, ఈసీలు సమర్పించాల్సి ఉంటుంది. వాటి కోసం ఎక్కడో ఉన్న మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సి ఉండేది. ఇకపై మీసేవ కేంద్రాలకు వెళ్లకుండానే సంఘంలోనే ఉన్న సీఎస్‌సీలో వాటిని తక్కువ ధరకే తీసుకునే అవకాశం కలిగింది. అలాగే బ్యాంకుపరమైన లావాదేవీలు చేసుకోవచ్చు. బీమా ప్రీమియంలు చెల్లించొచ్చు. దీంతో రైతులకు సమయం, ఖర్చు భారం తగ్గనుంది. సహకార వ్యవస్థలో వస్తున్న మార్పులతో రైతులకు ప్రయోజనం చేకూరుతోంది. రైతులకు పంటసాగు నుంచి పండించిన వరి ధాన్యం అమ్ముకునే దాకా సహకార సేవ ఎంతో ఉంది. సంఘాల్లో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సేవలు మరింత మెరుగు



కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా సహకార సంఘాల్లో సేవలు మెరుగుపడతాయి. రైతుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరిస్తున్నాం. పహనీలు ఇతర సేవల కోసం రైతులు మీసేవ కేంద్రాలకు వెళ్లిరావడం ఇబ్బందిగా ఉంది. అందుకే సంఘాల్లో ఆ వెసులుబాటు కల్పిస్తున్నాం. గంభీరావుపేటతోపాటు కేడీసీసీబీ పరిధిలో 44 సంఘాల్లో సీఎస్‌సీలు ఏర్పాటు చేస్తున్నాం.

– కొండూరు రవీందర్‌రావు, టెస్కాబ్ చైర్మన్

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



సహకార సంఘాల్లో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్లను రైతులు, సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ సెంటర్లు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. సహకార వ్యవస్థలో మార్పులతో రైతులకు పనులు సులభతరం అవుతున్నాయి.

– కొమిరిశెట్టి విజయ, జెడ్పీటీసీ, గంభీరావుపేట

మార్చురీలో అక్రమ వసూళ్లు

- సిరిసిల్లలో పోస్టుమార్టం కోసం రూ.వేలల్లో వసూలు
- డబ్బులు తీసుకుంటున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్



మార్చురీలో నాగరాజుకు డబ్బులు ఇస్తున్న బాధితుడు

సిరిసిల్లటౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో ఓ ప్రబుద్ధుడు శవాలను పోస్టుమార్టం చేసే క్రమంలో బాధితుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు ఉన్న వీడియో బుధవారం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. స్థానికులు తెలిపిన వివరాలు. స్థానిక జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం కోసం వచ్చే శవాల బంధువుల నుంచి వార్డుబాయ్ నాగరాజు చాలా రోజులుగా డబ్బులు గుంజుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈమేరకు మంగళవారం ఓ మృతదేహం పోస్టుమార్టం కోసం రాగా సంబంధీకులను రూ.4వేలు డిమాండ్ చేశాడు. నిస్సహాయ స్థితిలో ఉన్న వారు రూ.2వేలు ఇస్తామని ప్రాధేయపడినా వినలేదు. డబ్బులు ఇవ్వకుంటే పోస్టుమార్టం చేయరని బెదిరించాడు. దీంతో బాధితులు రూ.4వేలు సమర్పించుకునే సమయంలో స్థానికులు వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. ఈవిషయమై జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మురళీధర్‌రావును వివరణ కోరగా.. ఈ సంఘటనపై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఆ ఇద్దరికి నిబంధనలు వర్తించవా?

- ఉపాధ్యాయ బదిలీల్లో అవకతవకలు
- జిల్లాలో చర్చనీయాంశం

సిరిసిల్లటౌన్: ఉపాధ్యాయ బదిలీల్లో ఇద్దరు పంతుళ్లకు అనుకూలమైన చోట్లలో పోస్టింగులు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. వివిధ సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లకు ఇటీవల జరిగిన బదిలీల్లో జీరో సెంటర్ స్కూల్‌కు పోస్టింగులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. ఒకరికి అంతర్ జిల్లా కాగా, మరొకరికి పోస్టింగ్ ఇచ్చిన మండలం కాకుండా మరో మండల పరిధికి డిప్యూటేషన్‌పై ఆర్డర్లు ఇచ్చినట్లు సమాచారం. నిబంధనల ప్రకారం డిప్యూటేషన్ పోస్టింగ్ ఉన్న మండల పరిధిలోనే ఉండాలి. కానీ సదరు ఇద్దరు టీచర్లు కోరుకున్న చోటుకు పోస్టింగ్ ఇచ్చారని విమర్శలు వస్తున్నాయి. ఈవిషయమై డీఈవో రమేశ్‌ను వివరణ కోసం 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా..అందుబాటులో లేరు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



నర్సింగాపూర్‌లో పశువైద్యశిబిరం

బోయినపల్లి(చొప్పదండి): పాడిరైతులు పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని నర్సింగాపూర్‌లో కరీంనగర్ జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. 49 పశువులకు గర్భకోశవ్యాధులు, 35 పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్స చేశారు. సర్పంచ్ జోగినిపల్లి ప్రేమ్‌సాగర్‌రావు, ఉపసర్పంచ్ లాల్ పర్శరాములు, బోయినపల్లి, విలాసాగర్ పశువైద్యాధికారులు రమేశ్, అశోక్‌కుమార్, మధుమిత, నరేందర్, రాములు, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలి

- టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కృష్ణప్రసాద్‌గౌడ్



బోయినపల్లి హైస్కూల్‌లో టీఆర్‌టీఎఫ్ సభ్యత్వ నమోదు

బోయినపల్లి(చొప్పదండి): ప్రభుత్వం ఉపాధ్యాయులకు పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. కృష్ణప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు లేవని, దీంతో పలువురు పదోన్నతి పొందకుండానే పదవీ విరమణ పొందనున్నారన్నారు. ఈ విషయంలో ఉద్యోగుల పదోన్నతి ఆకాంక్షను గుర్తించి ప్రభుత్వం మరోసారి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. టెట్ అర్హత పదోన్నతుల్లో మినహాయింపు ఇస్తే ఖాళీలు భర్తీ అవుతాయన్నారు. పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సుంకిశీల ప్రభాకర్‌రావు, బోయినపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు అశోక్‌రెడ్డి, సిరిగిరి రవీందర్, జిల్లా కౌన్సిలర్ మూల పర్శరాములు ఉన్నారు.

పేరుకే మైదానం !

- వాకింగ్‌ట్రాక్ లేదు.. ఓపెన్ జిమ్ లేదు
- ఆధునికీకరణతో అధ్వానంగా కాలేజీ మైదానం
- ఎక్కడి పనులు అక్కడే
- ఆరు నెలలుగా నిలిచిన పనులు
- ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు, వాకర్స్
- సిరిసిల్ల కాలేజీ మైదానం దుస్థితి

సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఏకైక మైదానం.. జూనియర్ కళాశాల గ్రౌండ్. ఇక్కడ నిత్యం పిల్లలు ఆటలు ఆడుకుంటారు.. పట్టణవాసులు వాకింగ్ చేస్తుంటారు. సిరిసిల్ల నడిబొడ్డున ఉన్న ఏకైక మైదానం కావడంతో అందరికి ఉపయోగపడుతుంది. ఈ మైదానాన్ని మరింత అభివృద్ధి చేయాలని, వాకింగ్ ట్రాక్ వేసి, ఓపెన్ జిమ్‌లను నిర్మించి, గ్యాలరీలతో, క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు రూ.2 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టిన పనులు ఆరు నెలలుగా ఎక్కడి పనులు అక్కడే ఉండడంతో కాలేజీ మైదానం మరింత అధ్వానంగా మారింది. రూ.2 కోట్ల పనులు చేయక ముందే కాలేజీ గ్రౌండ్ బాగుండే.. అనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఆ నిధులు సరిపోక అదనపు పనుల కోసం మళ్లీ అంచనాలు రూపొందించడం సర్కారు మార్క్ పనులకు అద్దం పడుతుంది. మున్సిపల్ ఇంజినీర్ల పట్టింపులేని తనానికి, పాలకవర్గం నిర్లక్ష్యానికి సిరిసిల్ల కాలేజీ మైదానం నిదర్శనంగా నిలుస్తుంది.

• ఏం జరిగిందంటే..!

సిరిసిల్ల కాలేజీ మైదానానికి చుట్టూరా ప్రహరీని 2002లో పనికి ఆహారంలో భాగంగా అప్పటి కలెక్టర్ సుమిత్రా దావ్రా ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారు. అప్పటి కళాశాల పిన్సిపాల్ లక్ష్మణ్‌రావు పట్టుదలగా ఆక్రమణలు తొలగించి ప్రహరీ నిర్మించి కళాశాల మైదానాన్ని రక్షించారు. మైదానంలో ఎప్పుడు వర్షం పడినా.. వరద నీరు వెళ్లిపోయే మార్గం లేక గ్రౌండ్ చెరువులా మారేది. ఈ ఒక్క సమస్య తప్ప పెద్దగా ఏ సమస్య లేకుండే. ఈ మైదానంలో వాకింగ్ ట్రాక్, మురికి కాల్వ, ఆటల భవనం, మరుగుదొడ్లు, గ్యాలరీ, స్వాగత తోరణ ఆర్చీ, గేట్ల నిర్మాణం వంటి పనులకు రూ.2 కోట్లు కేటాయించారు. గ్రౌండ్‌లో మట్టి పోసి, స్పోర్ట్స్ బిల్డింగ్ నిర్మించి, గ్యాలరీ కట్టి వదిలేశారు. 70 శాతం మేరకు పనులు పూర్తయినా.. ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. చేసిన పనులకు రూ.70లక్షల మేరకు బిల్లులు పెండింగ్‌లో ఉండగా.. ఆ బిల్లుల కోసం కాంట్రాక్టర్ మిగతా పనులు పూర్తి చేయలేదు.



మొదటి అంతస్తు పూర్తయిన స్పోర్ట్స్ భవనం

• పట్టణ వాసుల అసహనం

మంత్రి కేటీఆర్ చొరవతో సిరిసిల్ల అభివృద్ధిలో ముందుండగా.. కాలేజీ మైదానం మాత్రం వెనకబడింది. అభివృద్ధి.. ఆధునికీకరణ పనులు ఆ మైదానానికి శాపంగా మారాయి. నిత్యం వాకింగ్ చేసే వారు, ఆడుకునే పిల్లలు మైదానంలో అసంపూర్తి పనులతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రౌండ్ అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేసినా.. అవే పాట్లు తప్పడం లేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లోని పెండింగ్ పనులు పూర్తి చేసి, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మధ్యలో వదిలేసిన సెప్టిక్‌ట్యాంక్

గ్రౌండ్ బాగాలేక వాకింగ్ మానేశాను



గత పదేళ్లుగా నేను వాకింగ్ చేస్తున్నా.. కాలేజీ మైదానం బాగులేక ఈ మధ్య నేను వాకింగ్ మానేశారు. అందరికీ ఉపయోగపడే విధంగా మైదానాన్ని బాగు చేసి, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి. పెండింగ్ పనులు వేగంగా పూర్తి చేయాలి. పట్టణ వాసులకు అందుబాటులో ఉండే ఏకైక మైదానం ఇదే.

– జిందం రమేశ్, ట్యాక్స్ కన్సల్టెంట్, సిరిసిల్ల.

నిధులు మంజూరయ్యాయని సంతోషపడ్డాం



మంత్రి కేటీఆర్ కాలేజీ మైదానాన్ని బాగు చేసేందుకు నిధులు మంజూరు చేశారని అందరం సంతోషపడ్డాం. కానీ పనులు పెండింగ్‌లో ఉండడంతో ఇప్పుడు చాలా ఇబ్బందిగా ఉంది. నిత్యం వాకింగ్‌కు వచ్చే అన్ని వయసుల వారు, ఆడుకునే పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. కాలేజీ మైదానాన్ని బాగు చేయాలి..

– సబ్బని నరేందర్, వస్త్ర వ్యాపారి.

పెండింగ్ పనులు పూర్తి చేయిస్తాం



సిరిసిల్ల కాలేజీ మైదానంలో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను పూర్తి చేయిస్తాం. ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయించి, ఇతర పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం. వర్షాల కారణంగా కొన్ని పనులు చేసేందుకు ఆటంకం ఏర్పడింది. పెండింగ్ పనులు అన్నీ వేగంగా పనులు పూర్తి చేయిస్తాం. పట్టణ వాసులకు మైదానాన్ని అందుబాటులోకి తెస్తాం.

– జిందం కళాచక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయండి

- 60 రోజులు కష్టపడండి
- బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులు, సోషల్‌మీడియా వారియర్స్‌కు బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు కోరారు. 60 ఏళ్లలో దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని అభివృద్ధిని పదేళ్లలో సీఎం కేసీఆర్ చేసి చూపించారన్నారు. తన కోసం కేవలం 60 రోజులు శ్రమిస్తే తాను 60 నెలలు మీ కోసం పనిచేస్తానని పేర్కొన్నారు. వేములవాడలోని తన కార్యాలయంలో బుధవారం పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌తో సమావేశమయ్యారు. మాట్లాడారు. విద్వేషాలను పక్కన పెట్టి పనిచేసిన వారిని తప్పకుండా గుండెల్లో పెట్టుకుంటానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు పుల్కం రాజు, కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, గుండెకార్ల నరేశ్, ముష్టం జీవన్‌గౌడ్, వనపట్ల సందీప్‌రెడ్డి, మంద రాజేందర్, కాసర్ల అరుణ్, గంగసాని రమణారెడ్డి, పసుల అంజి, మధు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

హోరెత్తిన నిరసనలు



సిరిసిల్ల మున్సిపల్ ముందు కార్మికుల ధర్నా

- సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు
- ధర్నాలు..దీక్షలతో దద్దరిల్లిన సిరిసిల్ల

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో నిరసనలు కొనసాగుతున్నాయి. బుధవారం కలెక్టరేట్, అంబేడ్కర్‌చౌరస్తా వద్ద పలు సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టారు. పేస్కేల్ అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఈ పంచాయతీ ఉద్యోగులు చేపట్టిన నిరసన కొనసాగింది. కలెక్టరేట్ ముందు దీక్షాశిబిరంలో బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బండి స్వామి, గడ్డం శేషాద్రి, శ్రీధర్, శాణగొండ రమేశ్, శ్రీనివాస్, రఘు పాల్గొన్నారు.

మధ్యాహ్న కార్మికుల నిరసన

మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలని కోరారు. నాయకులు మీస లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మి, సత్తయ్య, సావిత్రి, మల్లవ్వ, నర్సయ్య, మంజుల, రేణుక, కనకలక్ష్మి ఉన్నారు.

ఆశవర్కర్ల భిక్షాటన

ప్రభుత్వ తీరుపై నిరసనగా ఆశవర్కర్లు భిక్షాటన చేపట్టారు. రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు మూశం ర మేశ్, సీఐటీయూ నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, ఆశవర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదవేణి మంజుల, ప్రధాన కార్యదర్శి జయశీల, చంద్రకళ, లత, రాణి, లావణ్య తదితరులు ఉన్నారు.



సిరిసిల్లలో ఆశవర్కర్ల భిక్షాటన

హరీశ్‌రావు దిష్టిబొమ్మ దహనం

ప్రధాని నరేంద్రమోదీ ఫ్లెక్సీని మంత్రి హరీశ్‌రావు చించివేయడాన్ని బీజేపీ నేతలు వ్యతిరేకించారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, కౌన్సిలర్ గూడూరి భాస్కర్, ఎనగంటి నరేశ్, కొండ నరేశ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులపై వివక్ష వీడాలి

ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులపై చూపుతున్న వివక్ష వీడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ విమర్శించారు. కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ముందు ధర్నా చేశారు. అక్టోబర్ 8 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మోర అజయ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కాసాని శంకర్, పట్టణాధ్యక్షుడు సుల్తాన్ శంకరయ్య, గడ్డం భారతక్క, గడ్డం విజయ్, రెడ్డిమల్ల రాజయ్య, అర్జున్, మమత తదితరులు పాల్గొన్నారు.

పోత్గల్ ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

సిరిసిల్ల: ముస్తాబాద్ మండలం పోత్గల్ ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్‌ను సిరిసిల్లలో బుధవారం సన్మానించారు. వేములవాడరూరల్ ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, వేములవాడ సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు ఏశ తిరుపతియాదవ్, రాము, పుట్టపాక లక్ష్మణ్ శాలువా, మెమెంటోతో సత్కరించారు.

వీర్నపల్లి:వీర్నపల్లి నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గుజ్జుల రాజిరెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొలువుదీరిన ఏఎంసీలు





రాచర్లబొప్పాపూర్ చైర్మన్ మోహన్‌కుమార్‌కు సన్మానం, బాధ్యతలు స్వీకరిస్తున్న పోతుగల్ చైర్మన్

గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గాల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం నిర్వహించారు. గంభీరావుపేట, రాచర్లబొప్పాపూర్ మార్కెట్ కమిటీల చైర్మన్లు హన్మంతరెడ్డి, ఎలుసాని మోహన్‌కుమార్, వైస్‌చైర్మన్లు లింగంయాదవ్, బందారపు బాల్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. పాలకవర్గాలను టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సన్మానించారు. రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో పవర్‌లూమ్స్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగారావు, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, వంగ కరుణ, సర్పంచులు కటకం శ్రీధర్‌పంతులు, కొండాపురం బాల్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్ ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ ఆశీస్సులతో ఏఎంసీ చైర్మన్‌గా రైతులకు సేవలు చేసే అదృష్టాన్ని కల్పించారన్నారు. కేటీఆర్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామన్నారు.



గంభీరావుపేట పాలకవర్గానికి సన్మానం



బాధ్యతలు స్వీకరిస్తున్న వీర్నపల్లి ఏఎంసీ

వీర్నపల్లి: వీర్నపల్లి నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గుజ్జుల రాజిరెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్ట్

రుద్రంగి(వేములవాడ): పిల్లల కదలికలు, అలవాట్లలో మార్పులు, ఆరోగ్య పరిస్థితుల్లో మార్పులు మొదట తెలిసేది తల్లిదండ్రులకేనని.. ఎల్లప్పుడు పిల్లలను గమనించాలని చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ కోరారు. రుద్రంగిలో గంజాయి సేవిస్తున్న ముగ్గురిని బుధవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వివరాలు వెల్లడించారు. రుద్రంగికి చెందిన గడ్డం మనోహర్, కథలాపూర్ మండలం చింతకుంటకు చెందిన వేముల వివేక్, పోసానిపేటకు చెందిన దానవేని వివేక్ స్థానిక బతుకమ్మకుంట శివారులోని రేకులషెడ్డులో గంజాయి సేవిస్తుండగా ఎస్సై రాజేశ్ సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తి మృతికి కారణమైన వాహనదారుడిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల గొల్లపల్లి శివారు సత్తెపీరీల దర్గా వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన వాహనదారుడిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. దర్గా వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టి సంఘటన స్థలం నుంచి పరారయ్యాడు. ఇందుకు సంబంధించిన వివరాలు సేకరించగా.. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌కు చెందిన బర్కుటి ప్రశాంత్‌గా తెలిసింది. అతివేగంగా వాహనం నడిపి వ్యక్తి మృతికి కారణమైన ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

'హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలి'

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిద్దిపేటలో ప్రధాని నరేంద్రమోదీ రైలును వర్చువల్‌గా ప్రారంభించిన సమయంలో ఆ జిల్లా మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యవహరించిన తీరు హాస్యాస్పదంగా ఉందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నేవూరి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధాని రైలును ప్రారంభిస్తున్న సమయంలో ఈ కార్యక్రమాన్ని లైవ్‌లో చూస్తున్న మంత్రి, ఎంపీలు టీవీని కాలుతో తన్నడం, మోదీ ఫ్లెక్సీలను చింపమని కార్యకర్తలను పురమాయించడం దారుణమన్నారు.

ఆదరించండి అభివృద్ధి చేస్తా

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

రుద్రంగి(వేములవాడ): గత నాలుగుసార్లు వేములవాడ ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడినప్పటికీ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని, గెలిచిన ఎమ్మెల్యే కరోనా కష్టకాలంలో ప్రజలను నట్టేట వదిలేసి జర్మనీ పారిపోయిన ప్రజలకు అండగా ఉన్నానన్నారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. రుద్రంగిలో బుధవారం గడపగడపకు కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసి మాట్లాడారు. వేములవాడ ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు తూము జలపతి, రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత, ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామాధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం, నాయకులు పల్లి గంగాధర్, ఎర్రం గంగనర్సయ్య, ధార్న మల్లేశం, గండి నారాయణ పాల్గొన్నారు.

ఆరు పథకాలను అమలు చేస్తాం

వేములవాడరూరల్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాలను అధికారంలోకి రాగానే అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని వట్టెంలలో బుధవారం పార్టీ పథకాలపై ప్రచారం చేసిన సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ ఇస్తామని మాట ఇచ్చిన సోనియాగాంధీ నిలబెట్టుకుందని, అలాగే పథకాలను కూడా అమలు చేస్తామన్నారు. ఎన్నికల సమయంలోనే ఓట్ల కోసం వచ్చే ఇతర నాయకులను నమ్మొద్దని కోరారు. వేములవాడ రూరల్ మండలాధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, వట్టెంల ఎంపీటీసీ రంగు వెంకటేశం, సంగ స్వామి, బండ శ్రీను, బొడ్డు రాములు, చిలుక ప్రభాకర్, దశరథం, జగదీశ్, వంగపల్లి మల్లేశం, రొండి రాజు తదితరులు ఉన్నారు.



ప్రచారం చేస్తున్న ఆది శ్రీనివాస్

అవినీతి లేని పాలనే లక్ష్యం

- ఏఐఎఫ్‌బీ ఎన్నికల కమిటీ రాష్ట్ర చైర్మన్ మృత్యుంజయం

సిరిసిల్లటౌన్: అవినీతి లేని పాలనే ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ కటుకం మృత్యుంజయం పేర్కొన్నారు. సిరిసిల్లలో బుధవారం పార్టీలో వందమంది యువకులు చేరగా.. ఈ సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో మాట్లాడారు. సుభాష్ చంద్రబోస్ ఆశయాలకు అనుగుణంగా తమ పార్టీ పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని తెలిపారు. కాళేశ్వరం నీళ్లు సిరిసిల్లకు రాలేదని, తొమ్మిదో ప్యాకేజీ పనులు పదేళ్లుగా పూర్తి చేయనందుకు మంత్రి కేటీఆర్ జిల్లా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కోరారు. ఎన్నికలు వస్తున్నాయనే ఇళ్లు పంపిణీ చేస్తున్నారని ఇందులో అనేక మంది అనర్హులైన వారికి అందించారన్నారు. గంభీరావుపేటలోని కేజీ టు పీజీ భవనం నిర్మాణంలో కోట్లాది రూపాయల అవకతవకలు జరిగాయని, తెగిపోయిన చెక్‌డ్యాంలు మరమ్మతులు చేస్తూ కేటీఆర్ బంధువులు ఆస్తులు పెంచుకుంటున్నారని ఆరోపించారు. రోడ్ల అభివృద్ధి శూన్యమని, ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్, ఆక్వాహబ్ పేరుతో కేటీఆర్ బంధువులకు తక్కువ రేట్లకే భూములు కట్టబెడుతున్నారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మేకల కమలాకర్, నాయకులు గోపగారి లక్ష్మీనారాయణగౌడ్, వడ్లూరి చందు, నల్ల రాజ్‌కుమార్, గణేశ్, సంపత్, మహేశ్, సాయికుమార్ పాల్గొన్నారు.



కార్యకర్తలను ఆహ్వానిస్తున్న కటుకం మృత్యుంజయం

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరికలు

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు

బోయినపల్లి(చొప్పదండి): సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని మాన్వాడకు చెందిన బీజేపీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు జనగం లక్ష్మణ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బండి అంజయ్యతోపాటు పలువురు యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మాన్వాడ ఎంపీటీసీ ఐరెడ్డి గీత, ఆర్బీఎస్ మండలాధ్యక్షుడు కొనుకటి లచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ యూత్ మండలాధ్యక్షుడు కట్ట గోవర్ధన్, ఐరెడ్డి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ మోతె ఎల్లారెడ్డి, ఎలగందుల వేణు, ఉమేశ్, రాజు, హరీశ్, భూమయ్య, దేవయ్య, ప్రశాంత్, నరేశ్, వెంకటి తదితరులు ఉన్నారు.

డీసీసీ ప్రధాన కార్యదర్శిగా వెంకట్‌రెడ్డి



నియామకపత్రం అందిస్తున్న ఆది శ్రీనివాస్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని గోపాల్‌రావుపల్లెకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కూతురు వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో ప్రధాన కార్యదర్శిగా నియమించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని పేర్కొన్నారు.